ద్విచక్రవాహనంపై నలుగురు ప్రయాణం

కంపు కొడుతున్న 'పురం'

గల్లీ నుంచి ఢిల్లీ వరకు నాయకులు, అధికారులు ప్రతి ఒక్కరు ప్రతి నిత్యం స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ హిందూపురం అంటుంటారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి వారి మాటలకు విరుద్ధంగా ఉంది. హిందూపురం పట్టణంలోని పురపాలక సంఘం ఆధీనంలో ఉన్న ప్రవేటు బస్టాండ్ ప్రాంతం కంపుకొడుతోంది. పురపాలక సంఘం తరపున మరుగుదొడ్ల నిర్మాణం చేయక పోవడంతో ప్రయాణికులు అక్కడ ఖాళీ స్థలంలోనే మూత్ర విసర్జన చేస్తున్నారు. ఆ ప్రాంతంలో సంచరించే ప్రతి ఒక్కరు కంపును భరించలేక ముక్కు మూసుకుని పాలకులను, మున్సిపల్ అధికారులను తిట్టుకుంటూ అక్కడి నుంచి వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది.

ప్రజాశక్తి-హిందూపురం

ఎన్నో సంవత్సరాలుగా హిందూపురం పురపాలక సంఘం ఆధీనంలో ప్రవేటు బస్టాండ్ ఉంది. ఈ బస్టాండ్ నుంచి వేలాది మంది రాక పోకలు చేస్తున్నారు. పాలకులు ఈ బస్టాండ్‌కు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు పెట్టడంతో పాటు అక్కడ ఆయన విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. అధికార పార్టీ వేడుకలతో పాటు ప్రతి సంవత్సరం రాజశేఖర్ రెడ్డి జయంతి, వర్ధంతి ఇతర కార్యక్రమాలు ఇక్కడ నిర్వహిస్తారు. అయితేకనీస సౌకర్యాలు కల్పించడంలో పాలకులు, అధికారులు విఫలయ్యారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతంలో మరుగుదొడ్ల నిర్వహణ కోసం ఓ గుత్తేదారుడికి స్థలాన్ని కేటాయించారు. ఆసమయంలో ఆవ్యక్తి స్వయంగా మరుగుదొడ్లు నిర్మాణం చేసుకోవడంతో నిర్వహణ బాధ్యతను అతనికి అప్పగించారు. అయితే అక్కడ ఉన్న కూరగాయ మార్కెట్ శిథిలావస్థకు చేరుకోవటంతో మార్కెట్‌ను కూల్చారు. మార్కెట్ పక్కన ఉన్నా మరుగుదొడ్లను సైతం కూడా కూల్చి మరో స్థలం కేటాయిస్తామని గుత్తేదారులకు చెప్పి నష్ట పరిహారంగా విధించిన గడువును పెంచుతామని ఆసందర్భంగా హామీ ఇచ్చారు. ఆ సమయంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఉన్న శిథిలావస్థకు చేరిన మరో మరుగుదొడ్ల భవనాన్ని వారికి కేటాయించారు. అయితే దానిని సైతం ఇటీవల పురపాలక సంఘం వారు కూల్చివేశారు. ఆమయంలో సైతం ఇంక గడువు ఉందని, ఇదే ప్రాంతంలోనే మరో స్థలాన్ని కేటాయిస్తామని ఆ గుత్తేదారుడుకి భరోసా ఇవ్వడంతో పాటు నిర్మాణం చేసుకోవడానికి అధికారులు స్థలాన్ని కేటాయించారు. అయితే ఆ గుత్తేదారుడు ఇంత వరకు కేటాయించిన స్థలంలో మరుగుదొడ్ల కోసం భవన నిర్మాణం చేపట్టలేదు. దీనికి ప్రధాన కారణం ఆ ప్రాంత కౌన్సిలర్ అడ్డుకొన్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. అయితే గుత్తేదారుడు కోర్టును ఆశ్రయించగా కోర్టు గుత్తేదారుడుకి స్థలాన్ని చూపించి, నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని సూచించినప్పటికి మున్సిపల్ అధికారులు కోర్టు సూచనలను సైతం పక్కన పెట్టి పాలకులే తమకు ప్రభువులు అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఇంత వరకు గుత్తేదారుడికి స్థలాన్ని చూపింలేదు. ఈ విషయంపై పలు మార్లు మున్సిపల్ చైర్‌పర్సన్ చాంబర్‌లో చర్చలు జరిపారు. నిర్మాణానికి అడ్డుపడుతున్న కౌన్సిలర్ భర్త, ఆ గుత్తేదారుడితో జరిపిన చర్చలు ఫలించలేదు. దీంతో ఆ గుత్తేదారుడు మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకు రావడం లేదని తెలుస్తోంది. దీంతో ఖాళీ స్థలంలో మూత్ర విసర్జన చేయడం వల్ల ఆ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతోంది.

బస్టాండ్ ఆవరణంలో పేరుకుపోయిన చెత్త

సమస్యను పరిష్కరిస్తాం

ఈ విషయాలు గతంలో ఉన్నా కమిషనర్‌కు పూర్తిగా తెలుసు. తాను బాధ్యతలు స్వీకరించనప్పటి నుంచి ఈ విషయాలు నా దృష్టికి రాలేదు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో చర్చించి, ప్రజా అవసరాల నిమిత్తం బస్టాండ్ ఆవరణంలో మరుగుడొడ్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం.

ప్రమోద్ కుమార్,
మున్సిపల్ కమిషనర్

ప్రమాదమని తెలిసినా ప్రయాణం

ప్రజాశక్తి రొద్దం

ద్విచక్ర వాహనంలో ఒకరు లేదా ఇద్దరు ప్రయాణిస్తారు. మరిమించితే అతికష్టం మీద ముగ్గురు వెళ్లడం చూస్తుంటాం. అయితే ఇక్కడ ఏకంగా నలుగురు ద్విచక్ర వాహనంలో వెళుతున్నారు. అంతే కాకుండా ముందర ఒక బ్యాగ్ కూడా వేసుకొని ప్రమాదకరంగా ప్రయాణం చేపట్టిన సంఘటన మండలంలోని ఆర్. మరువపల్లి వద్ద పెనుకొండ పావగడ ప్రధాన రహదారిలో బుధవారం ప్రజాశక్తి కంటపడింది. ప్రమాదం అని తెలిసిన కూడా తప్పని ప్రయాణం. ఏమాత్రం పట్టుతప్పినా నలుగురూ ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది.

యూజర్-ఛార్జీల వసూలు తప్పనిసరి

మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా ఇంటింటి చెత్త సేకరణకు సంబంధించి వసూలు చేయాల్సిన యూజర్ చార్జీలను తప్పనిసరిగా వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ శానిటేషన్ సెక్రటరీలను ఆదేశించారు. గురువారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో శానిటేషన్ సెక్రటరీలతో సమీక్షా సమావేశాన్ని అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డితో కలిసి కమిషనర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతు పురపాలక సంఘ వ్యాప్తంగా 22 వాహనాల్లో ఇంటింటి చెత్త సేకరణ జరుగుతోందన్నారు. అయితే దీనికి సంబందించి యూజర్ ఛార్జీలు పూర్తి స్థాయిలో వసూలు చేయడం లేదన్నారు. ప్రతి వార్డులోను వందశాతం యూజర్ ఛార్జీలను వసూలు చేసే బాధ్యత ఆయా సచివాలయ సెక్రటరీలపై ఉందన్నారు. మెప్మా విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆర్‌పిల సహకారంతో ప్రతి నెలా యూజర్ ఛార్జీలు వసూలు చేయాలన్నారు. నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా పురపాలక సంఘ వ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేదిత చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. దీంతో పాటు ఆయా సచివాలయాల పరిధిలో ప్రజలకు ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగిస్తున్న వ్యాపారులపై జరిమానాలు విధించి, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు కాలువలపై ప్రత్యేకదృష్టి సారించి, ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి పట్టణాన్ని సర్వ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులతో ఓబులు, తదితరులు

సత్యసాయి తాగునీటి సరఫరా

కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

సత్యసాయి నీటి సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సత్యసాయి వాటర్ వర్కర్ల జనరల్ బాడీ సమావేశం మధుసూదన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 60 మంది వాటర్ సప్లై వర్కర్లు సిఐటియులో చేరారు. ఇప్పటివరకు ఏ సంఘం తమ సమస్యలు పరిష్కారానికి కృషి చేయలేదని కార్మికులు అన్నారు. సిఐటియుతోనే తమ సమస్యలు పరిష్కారం కాగలవన్న నమ్మకంతో తాము ఇందులో చేరుతున్నామని కార్మికులు తెలిపారు. అనంతరం ఓబులు మాట్లాడుతూ, 12 నెలలుగా ఇవ్వాల్సిన పిఎఫ్ ఇవ్వలేదని, రెండు నెలల వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. శుక్రవారం అనంతపురంలో జరిగే సమావేశంలో కార్మికుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుపోవటమే కాకుండా వాటి పరిష్కారానికి గట్టిగా కృషి చేస్తామన్నారు. ఇఎస్ వెంకటేష్ మాట్లాడుతూ, సత్యసాయి వాటర్ సప్లై వర్కర్లతో పాటు శ్రీరామ్ రెడ్డి వాటర్ సప్లై వర్కర్లకు సిఐటియు అండగా ఉంటుందన్నారు. సమాన పనికి సమాన వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించాలని, పెండింగ్ లేకుండా ప్రతినెల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్, వెంగళమ్మ చెరువు పంపు హౌస్‌లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్ సప్లై వర్కర్ల యూనియన్ నాయకులు చందు, శివారెడ్డి, ప్రభు, హరీష్, సాయి, రాజేష్, నాగేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి ఎంపిపిగా త్రివేణి ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-బత్తలపల్లి

బత్తలపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలి ఎంపిక. ప్రమాణస్వీకార కార్యక్రమం గురువారం అభిమానుల నడుమ అట్టహాసంగా జరిగింది. మండలంతో పాటు నియోజకవర్గంలోని వైసిపి అభిమానులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ఎంపికను మండల ప్రత్యేకాధికారి రామకష్ణ అధ్యక్షతన నిర్వహించారు. మండలంలో 11 మంది ఎంపీటీసీ సభ్యులుండగా ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు వివిధ కారణాలతో గైర్హాజరయ్యారు. తొలుత గుర్రం వనజ ఎంపీపీగా ఎన్నికకాగా ఆమె అనివార్య కారణాలతో పదివికి రాజీనామా చేశారు. దీంతో ఆమె స్థానంలో ఎంపీపీగా అప్రాచెరువు ఎంపిటిసి సభ్యురాలు బగ్గిరి త్రివేణి ఎన్నిక అయ్యారు. ఆమెకు డిక్లరేషన్ ఫారంను అధికారులు అందజేసి, ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ఎమ్మెల్యే అభినందనలు

ఎంపీపీగా ప్రమాణస్వీకారం చేసిన బగ్గిరి త్రివేణిని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఎంపీపీకి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మండలాభివద్ధికి తన వంతు సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. మండలాన్ని అభివద్ధి పథంలోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎంపిపిగా ఎన్నికైన బగ్గిరి త్రివేణితో పాటు వైసిపి మండల కన్వీనర్ జగ్గిరి బయపరెడ్డిలను పలువురు అభినందించారు. ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, జెడ్పిటిసి కోటి సుధ, డీసీఎంఎస్ ఛైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్రెడ్డి, తాడిమర్రి ఎంపిపి పాటిల్. భువనేశ్వర్‌రెడ్డి, ఆదినారాయణయాదవ్, ఇందుకూరు నారాయణరెడ్డి, ధర్మవరం వైస్ ఎంపిపి రావులచెరువు ప్రతాప్‌రెడ్డి, ధర్మవరం మున్సిపల్ వైస్ ఛైర్మన్ నాగరాజు, మాజీ వైస్ ఛైర్మన్ చందమూరి నారాయణరెడ్డి, పుట్టపర్తి ఎంపిపి రమణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు ఉషారాణి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గొలపల్లి రామకష్ణారెడ్డి, జిల్లా ఆదికార ప్రతినిది గుర్రం శ్రీనివాసరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డిలు సత్కరించారు. చేరుకున్నారు ప్రమాణస్వీకారం అనంతరం ఎంపీడీఓ కార్యాలయం. బత్తలపల్లి కూడలిలో పెద్ద ఎత్తున వాలుసంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి

నూతన ఎంపిపి త్రివేణి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎంపిపి పదవిని ఇచ్చిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకుని మండలాన్ని ఆదర్శ మండలంలా అభివృద్ధి చేస్తానని ఈసందర్భంగా ఆమె తెలిపారు. ఈసందర్భంగా నూతన ఎంపిపికి పలువురు అభినందనలు తెలిపారు.

ఎంపీపీగా ప్రమాణస్వీకారం చేస్తున్న బగ్గిరి త్రివేణి

ఎంపిపికి అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా కాచర్ల లక్ష్మి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా చేనేత వర్గానికి చెందిన కాచర్ల లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం నాడు నూతన మున్సిపల్ ఛైర్పర్సన్ ఎన్నికను ప్రిసైడింగ్ ఆఫీసర్, ఆర్డీవో తిప్పేనాయక్ నిర్వహించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సమక్షంలో ఛైర్‌పర్సన్ ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 40 మంది కౌన్సిలర్లు ఉండగా 7 మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. 15వ వార్డు కౌన్సిలర్ కుండా చౌడయ్య 6వవార్డు కౌన్సిలర్ కాచర్ల లక్ష్మిని ఛైర్మన్ అభ్యర్థిగా ప్రతిపాదించగా 11వ వార్డు కౌన్సిలర్ అత్తర్ జిలాన్ బాషా బలపరిచారు. కౌన్సిలర్లు అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు. కాచర్ల లక్ష్మి చేనేత ప్రిసైడింగ్ ఆఫీసర్ తిప్పేనాయక్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం డిక్లరేషన్ ఫారం అందించారు. నూతనంగా ఎంపికైన ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కౌన్సిలర్లు అందరినీ కలుపుకుని పట్టణాభివద్ధికి కృషి చేయాలని సూచించారు. గతంలో ఉన్న ఛైర్‌పర్సన్ లింగం నిర్మల రెండేళ్లు సమయస్ఫూర్తిగా పనిచేసిందని, అలాగే ప్రస్తుత పాలకవర్గం కూడా పని చేయాలని తెలిపారు. మరో 9నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయని, కౌన్సిలర్లు అందరూ ఆయా వార్డుల్లో కష్టపడి ఓట్లు వేయించే బాధ్యతను తీసుకోవాలన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి చేస్తాం
కాచర్ల లక్ష్మి, మున్సిపల్ ఛైర్‌పర్సన్.

నూతన ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఛైర్మన్ పదవిని ఇచ్చిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్లు అందరినీ కలుపుకుని పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. అనంతరం -మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, వైస్ ఛైర్మన్ పెనుజూరు నాగరాజు, వార్డు సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు నూతన ఛైర్‌పర్సన్‌ను పుష్పగుచ్చాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

నేడు నూతన ఛైర్‌పర్సన్ ర్యాలీ

ధర్మవరం మున్సిపల్ నూతన ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి శుక్రవారం ఉదయం 8గంటలకు శివనగర్ శివాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో శివాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు జరిగే ర్యాలీలో మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, చేనేత ప్రముఖులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని ఛైర్‌పర్సన్ కోరారు.

మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న కాచర్ల లక్ష్మి

నూతన ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

టిబి డ్యామ్

టిబి డ్యామ్ నీటి కేటాయింపులు

హెచ్ఎల్‌సికి 26.828 టిఎంసిలు
మొదటి సమీక్ష పూర్తి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తుంగభద్ర డ్యామ్ (టిబి డ్యామ్) కిందనున్న ప్రధాన కాలువలకు నీటి కేటాయింపులు జరిగాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం మొదటి సమీక్షా సమావేశం గురువారం జరిగింది. ఆన్‌లైన్‌లో జరిగిన ఈ సమీక్షలో అటు కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి ఇంజనీర్లు పాల్గొన్నారు. హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సి అటు కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు 2023-24 సంవత్సరంలో నీట కేటాయింపులపై మూడు ప్రాంతాల సూపరింటెండెంట్ ఇంజనీర్లు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఇప్పుడున్న అంచనాల ప్రకారం ఈ ఏడాది 175 టిఎంసిల నీరు అందుబాటులో ఉండే అవకాశముందని అంచనా వేశారు. దీని ప్రకారం తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కింద అనంతపురం జిల్లాకు చెందిన హెచ్ఎల్‌సికి దామాషా పద్ధతి ప్రకారం కర్నాటక రాష్ట్రానికి 114.732 టిఎంసిలు, ఆంధ్రప్రదేశ్‌కు 54.895 టిఎంసిలు, తెలంగాణాకు 5.374 టిఎంసిలు కేటాయించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే నీటిలో చూసినప్పుడు హెచ్ఎల్‌సికి 26.828 టిఎంసిలు, ఎల్ఎల్‌సికి 19.811 టిఎంసిలు కేటాయించారు. ఇది ప్రాథమిక కేటాయింపులు. నీటి లభ్యతను బట్టి మరోమారు పున:సమీక్ష జరుపనున్నట్టు ఎస్ఇ రాజశేఖర్ తెలిపారు.

గతేడాది 32.821 టిఎంసిలు

2022-23 సంవత్సరంలో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు 32.821 టిఎంసిల నీరు జిల్లాకు వచ్చింది. గతేడాది మంచి వర్షాలు పడటంతో నీరు పుష్కలంగా లభించింది. జిల్లాకు సాధారణంగా 28.821 టిఎంసిలు కేటాయించగా నాలుగు టిఎంసిలు వచ్చాయి. మొత్తంగా 32.821 టిఎంసిలు వచ్చాయి.

కాలువలకు మరమ్మతులకు నోచుకునేనా ?

నీరు పుష్కలంగా ఉంటున్నా ప్రవహించే కాలువల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో నీటిని పూర్తి స్థాయి సామర్థ్యంతో నీటిని తీసుకోలేని పరిస్థితి ఉంది. ఆధునీకరణ కాకున్నా మరమ్మత్తులకైనా నిధులివ్వాలని అధికారులు కోరుతున్నారు. ఈ నిధులు నీటి విడుదల్లోపు మంజూరు చేసి మరమ్మత్తులు చేపట్టాల్సి ఉంది.

విద్యుత్ వాహనాలతో పర్యావరణ పరిరక్షణ

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

విద్యుత్ వాహనాల వల్ల పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఆవరణంలో ఎలక్ట్రికల్ వాహనాలకు సంబంధించిన స్టాల్స్‌ను ప్రారంభించి, వాహనాలను పరిశీలించారు. ఈసందర్భంగా ద్విచక్ర వాహనాన్ని నడిపిన కలెక్టర్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధికి ఇంధన సామర్థ్యం చాలా కీలకమన్నారు. సాంకేతిక పురోగతి వేగంగా వృద్ధి చెందుతున్నదన్నారు. ఇంధన వాయు కాలుష్య నివారణకు విద్యుత్ వాహనాల వినియోగం పెరగాలని తెలిపారు. విద్యుత్ వాహనాల వినియోగం వల్ల వాతావరణంలో కాలుష్యం తగ్గి పర్యావరణ పరిరక్షణతో పాటు తగ్గిపోతున్న ఇంధన వనరులను కూడా ఆదా చేయవచ్చన్నారు. పట్టణాల్లో, నగరాల్లో రోజురోజుకు కాలుష్యం పెరిగిపోతోందన్నారు. సౌరశక్తితో నడిచే విద్యుత్ అందించేందుకు బిహెచ్ఇఎల్ డిస్కముల ద్వారా తగిన సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకొంటోందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఈ వాహనాన్ని నడుపుతున్న కలెక్టర్

హిందూపురం తహశీల్దార్‌గా హసీనా సుల్తానా

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం తహశీల్దార్‌గా హసీనాసుల్తానా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహశీల్దార్ శ్రీనివాసులు గత ఏడాది ఆగస్టులో బదలీపై వెళ్లారు. అప్పటి నుంచి దాదాపు 10 నెలల పాటు ఇక్కడ ఐదుగురు ఇన్‌ఛార్జి తహశీల్దార్లు విధులు నిర్వర్తించారు. ఈ నేపథ్యంలో సాధారణ బదిలీల్లో భాగంగా రొళ్ల మండల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న హసీనా సుల్తానాను హిందూపురం తహశీల్దార్‌గా జిల్లా కలెక్టర్ నియమించారు. ఈ నేపథ్యంలో గురువారం బాధ్యతలు స్వీకరించిన హసీనా సుల్తానా మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధన్యత ఇస్తామన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు ఇన్‌ఛార్జి తహశీల్దార్ ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు, వైసిపి కౌన్సిలర్లు, ఇతర పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

బాధితురాలికి తోటి ఉద్యోగులు సాయం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలోని అంగన్వాడీ కేంద్రంలో హెల్పర్‌గా పని చేస్తున్న డాలి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యచికిత్సలకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న తోటి ఉద్యోగులు డాలికి సహాయం అందించాలని సంకల్పించారు. ప్రాజెక్టు పరిధిలో ఉన్న అందరు కలిసి నిధులను సేకరించారు. సేకరించిన నిధిని గురువారం హిందూపురం ప్రాజెక్టు అంగన్వాడీ యూనియన్ తరపున సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప చేతుల మీదుగా అందించారు. అందరు కలిసి తనకు సహాయం చేసినందుకు డాలి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య, సెక్టార్ లీడర్లు వరలక్ష్మి, శిరీష, విజయలక్ష్మి, నాగలక్ష్మి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి సాయం అందజేస్తున్న తోటి ఉద్యోగులు, నాయకులు

ఎంపిడిఒ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న కూలీలు

'ఉపాధి' కూలీలకు పనిముట్లు ఇవ్వాలి

లేపాక్షి : ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పనిముట్లు, తాగునీరు, రవాణా భత్యం, పే స్లిప్, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ఎంపిడిఒ నరసింహనాయుడు మాట్లాడుతూ వంద రోజులు పూర్తయిన కూలీలకు ప్రతి ఒక్కరికీ పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక సంఘం నాయకులు పిరంగి ప్రవీణ్‌కుమార్, నాయకులు రాజప్ప, కూలీలు రమేష్, ప్రేమావతి, కంచిసముద్రం, లేపాక్షి, గొంగటిపల్లి ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

17న విద్యార్థులకు బహుమతులు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని తొగట వీర క్షత్రియ విద్యార్థులకు ఈ నెల 17వ తేదీ సాయంత్రం 4 గంటలకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తొగటవీర క్షత్రియ సేవా సంఘం పట్టణ అధ్యక్షుడు బండారు ఆదినారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022-23లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో 540కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్కుల జాబితా, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలను జత చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 94402 09995, 94405 65933, 94408 44383 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు ఉద్యోగమేళా

కదిరి అర్బన్ : పట్టణంలోని ఎస్‌టిఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9వ తేదీ(నేడు) శ్రీసిటీ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ స్మిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు పాల్గొనవచ్చని ఆమె తెలిపారు. మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా, ఎంపికైన వారికి వసతి గృహం కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. హాజరయ్యే వారు సంబంధిత విద్యార్హత పత్రాలను వెంట తెచ్చుకోవాలని ఆమె సూచించారు.

డిప్యూటీ తహశీల్దార్‌గా స్వాతి

కొత్తచెరువు: మండల డిప్యూటీ తహశీల్దార్‌గా గురువారం స్వాతి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ వెంకటరెడ్డి అమడగూరు మండలానికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో బుక్కపట్నంలో సిఎస్‌డిటిగా పని చేస్తున్న స్వాతి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తెలిపారు.

హెచ్‌ఎం బాధ్యతలు స్వీకరణ

గాండ్లపెంట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయురాలుగా జి.మధురాంబ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న హెచ్‌ఎం ఒడిసి మండల పరిధిలోని తంగేడుకుంట జడ్పీ హైస్కూల్‌కు బదిలీ వెళ్లారు. ఈ సందర్భంగా నూతన హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలను అభివృద్ధి బాటలో నడిపిస్తానని, విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దాలని ఉపాధ్యాయ బృందానికి సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్ అలి, జయరాములు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

కదిరి అర్బన్ : పట్టణంలోని కుటాగుల్ల 132 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 10వ తేదీ(శనివారం) ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ చిన్నకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కదిరి పట్టణంతో పాటు తలుపుల, గాండ్లపెంట, నంబులపూలకుంట, ముదిగుబ్బ, ఒడిసి, అమడగూరు మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారం

గాండ్లపెంట : మండల పరిధిలోని గొడ్డవెలగల పంచాయతీ దళితవాడలో నెలకొన్న తాగునీటి సమస్యను ఎంపిపి టి.జగన్మోహన్ పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు రూ. లక్ష ఖర్చు చేసి బోరుకు నూతనంగా మోటారు అమర్చి తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యే సిద్ధారెడ్డి, ఎంపిపి టి.జగన్మోహన్, స్థానిక సర్పంచి ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

లేపాక్షి : మండల పరిధిలోని కంచిసముద్రం సెక్టార్‌కు చెందిన అంగన్వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకొన్న విద్యార్థులకు గురువారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిడిపిఒ రెడ్డి రమణమ్మ హాజరై మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకొన్న విద్యార్థులు ఎలిమెంటరీ విద్యకు వెళ్లడానికి సర్టిఫికెట్లు ప్రదానం చేశామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయమ్మ, మహిళా పోలీస్ రోజావతి, అంగన్వాడీ కార్యకర్తలు రూప, శశికళ, శాంతమ్మ, సుజాత, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డేలో సర్టిఫికెట్లతో చిన్నారులు

25 వేల ఎకరాల్లో రాగి పంట సాగు

జెసి టిఎస్ చేతన్

అధికారులతో మాట్లాడుతున్న జెసి చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో 25 వేల ఎకరాల్లో రాగి పంట సాగు చేసేలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కోర్టు ఛాంబర్‌లో గురువారం జెసి వ్యవసాయ, సివిల్ సప్లైస్, ఏపీ మార్క్ ఫెడ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాగి పంట సాగు విస్తీర్ణం పెంచాలని రైతుల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతినెలా చౌక ధాన్యాల డిపోల్లో లబ్ధిదారుల కు జూన్ నెల నుంచి ఇచ్చే బియ్యంకు బదులు 3 కిలోల రాగులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కంపెనీకి అవసరమైన రాగులను ఆయా జిల్లాల పరిధిలో రైతుల నుంచి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 3,578 ఉండగా అదనంగా రూ. 268 ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జిల్లాలో వచ్చే 6 నెలలకు లక్ష క్వింటాళ్ల రాగులు అవసరం అవుతాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో 30 వేల క్వింటాళ్లు పండిస్తుండగా రైతుల అవసరానికి 20వేల క్వింటాళ్లు పోగా, మరో 10 వేల క్వింటాళ్లు ప్రభుత్వం ద్వారా కొనుగోలుకు అందుబాటులోకి రావచ్చని అంచనా ఉందన్నారు. మిగతా 90 వేల క్వింటాళ్లు రైతులు పండించే విధంగా అవగాహన, ప్రోత్సాహం అందించాలన్నారు. సమావేశం లో వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఏపీ సీడ్స్ అధికారి ధనలక్ష్మి, పౌరసరఫరాల అధికారి అశ్వర్థ నాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి పెట్టాలి

ప్రాజెక్ట్ డైరెక్టర్ రామాంజనేయులు

పొలంలో పండ్ల మొక్కలు నాటుతున్న పిడి రామాంజనేయులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రైతులు పండ్ల తోటల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిర్లక్ష్యంగా ఉంటే పంట నష్టం కలుగుతుందని ప్రాజెక్టు డైరెక్టర్ రామాంజనేయులు సూచించారు. మండల పరిధిలోని సుబ్బారావుపేట, తుమ్మల గ్రామాల్లో ఉపాధి హామీ చట్టం ద్వారా చేపడుతున్న పండ్ల తోటల పెంపకం పనులను గురువారం ఆయన పర్యవేక్షించారు. తొలుత సుబ్బారావు పేటలో హరి నాథరెడ్డి పొలంలో గుంతల తవ్వకం పనులను పరిశీలించి, అనంతరం తుమ్మల గ్రామంలోని రామలింగారెడ్డి పొలంలో చీనీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది ఇప్పటి వరకూ 150 ఎకరాల్లో పండ్లతోటల పెంపకానికి అనుమతి లభించిందని తెలిపారు. కుటుంబానికి ఐదెకరాల పొలం కలిగి ఆసక్తి కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ చట్టంలో దానిమ్మ, కొబ్బరి, మామిడి, చీనీ, నేరేడు, జామ, డ్రాగన్ ఫ్రూట్, గులాబీ, గుండుమల్లె సాగుకు ప్రభుత్వం తోడ్పాటు ఇస్తోందని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఎంపిడిఒ కార్యాలయంలో ఏపీఓను లేదా గ్రామ పంచాయతీ స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో తుమ్మల గ్రామ రైతులు, ఎఫ్ఎలు పెద్దన్న, నరసింహులు, టిఎలు చంద్రకళ, పుణ్యవతి, భారతి, ఏపీవో అనిల్‌కుమార్ రెడ్డి, ఈసీ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్‌డిఎ యాప్ ఎంతో ఉపయోగకరం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రోజురోజుకీ పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టి బాధితుల ప్రాణాలు కాపాడటంలో ఐఆర్‌డిఎ యాప్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటా బేస్ ప్రాజెక్ట్ మేనేజర్ బీమ్లానాయక్ పేర్కొన్నారు. జిల్లా అదనపు ఎస్పీ ఎన్.విష్ణు ఆధ్వర్యంలో గురువారం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని పోలీసు అధికారులకు ఐఆర్‌డిఎ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీమ్లా నాయక్ మాట్లాడుతూ ప్రతిరోజూ దేశంలో రోడ్డు ప్రమాదాలతో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ రూపొందించిన ఈ యాప్ ద్వారా రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే వారి ప్రాణాలు కాపాడటంతో పాటు, ఆ వ్యక్తులు, వారి వాహనం, రహదారి, తదితర వివరాలు సమగ్రంగా ఎలా సేకరించాలో తెలుసుకోవచ్చని తెలిపారు. యాప్‌లో పోలీసు, రోడ్డు రవాణా, జాతీయ రహదారులు, వైద్య శాఖలు ఉమ్మడిగా పని చేస్తాయన్నారు. 2022 మార్చి 1వ తేదీ నుంచి ఇది అందుబాటులోకి వచ్చిందని, పోలీసులు ఈ యాప్‌పై ప్రజలకి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఈ యాప్‌పై పోలీసుల అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ ఆఫీసర్ రవిశంకర్, డిటిఆర్‌బి సిఐ సతీశ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికైన నాయకులకు నియామక పత్రం అందజేస్తున్న లాలేనాయక్

సమాచార ఐక్యవేదిక నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలోని సిఐటియు కార్యాలయంలో గురువారం సమాచార హక్కు ఐక్య వేదిక చట్టం వ్యవస్థాపక అధ్యక్షులు లాలేనాయక్ ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా వి.శివకుమార్, అధ్యక్షులు గా నామాల ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శిగా వాసుదేవ రెడ్డి, సహాయ కార్యదర్శిగా జి.శివకుమార్ యాదవ్, కోశాధికారిగా అశోక్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సంపత్ కుమార్ నాయక్, సహాయ కార్యదర్శిగా వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా రమణానాయక్, మహబూబ్ బాషా, గంగిరెడ్డి, సిద్దేశ్వర, పుట్టపర్తి పట్టణ కన్వీనర్‌గా ఎస్.సాయిప్రసాద్ యాదవ్, మహిళా విభాగం కన్వీనర్‌గా జి.త్రివేణి, జిల్లా కమిటీ సభ్యులుగా జి.వెంకటేష్ యాదవ్, వి.చిన్న తదితరులను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా లాలేనాయక్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కార్యకర్తలపై బెదిరింపులు కానీ, దౌర్జన్యం కానీ చేస్తే చట్టరీత్యా శిక్ష తప్పదన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల సౌకర్యార్థం గోడ పత్రికల ద్వారా ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రచార కార్యదర్శి టిసి శేఖర్, ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు సామ్రాట్ కెబి మధు, అనంతపురం జిల్లా అధ్యక్షులు రాయల్ కొండయ్య, ఆర్‌టిఐ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్టాపన

స్వామి వారిని దర్శించుకుంటున్న పార్థసారథి

రొద్దం : మండల పరిధిలోని కలిపి గ్రామంలో లక్ష్మీనరసింహ, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలతో పాటు ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పార్థసారథి పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆయన ఆలయ కమిటీ సభ్యులకు రూ. 10వేల విరాళం అందజేశారు.

రేషన్ బియ్యం కోసం పడిగాపులు

కొత్తచెరువు : ప్రతి నెలా లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి వాహనాల ద్వారా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేస్తామని ప్రభుత్వం, అధికారులు పేర్కొంటున్నారు. కొత్తచెరువు మేజర్ పంచాయతీలో 8 రేషన్‌షాపులు ఉండగా ఎక్కడా వాహనాల ద్వారా పంపిణీ చేయడం లేదు. అన్నిషాపుల్లో చౌక ధాన్యం డీలర్లు మూడు రోజులు మాత్రమే పంపిణీ చేసి ఆ తర్వాత వెళ్లే అయిపోయాయని సమాధానం ఇస్తున్నారు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు ఈ పాస్ మిషన్లు సర్వర్ సరిగా పనిచేయకపోవడం, వేలిముద్ర లు పడకపోవడంతో కార్డుదారులు షాపుల వద్దనే గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కో షాపునకు ఒక ఈపాస్ మిషన్ కేటాయించడంతో పాటు గడువు పెంచాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రతి కార్డుదారునికి బియ్యంతో పాటు నిత్యావసరాలు అందేలా చూడాలని కోరుతున్నారు.

సచివాలయాల వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్

డిఎంహెచ్‌ఒ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎంలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు నామాల ఈశ్వరయ్య ఆధ్వర్యంలో గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయాల ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సమస్యలపై చర్చించి డిఎంహెచ్‌ఓ ఎస్‌వి కృష్ణారెడ్డికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పిహెచ్‌సి హెల్త్ స్టాఫ్ తరహాలో బయోమెట్రిక్ హాజరు అమలు పరచాలని, అవసరమైన రికార్డులు, వైద్య సామగ్రి డిఎంహెచ్‌ఓ లేదా వైద్యాధికారి ఇవ్వాలని, క్యాజువల్ సెలవులు మంజూరు చేయాలని, యాప్‌లను కుదించాలని, పదోన్నతులు వర్తింపజేయాలని యూనిఫాం, దోబీ అలవెన్స్‌లు ఇవ్వాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని వార్డు, గ్రామ సచివాలయాల వైద్య సిబ్బంది కోరుతున్నారని వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. అలాగే గుండుమల వైద్యాధికారి డాక్టర్ శాంతి, పిహెచ్‌ఎన్ ప్రమీల కిందిస్థాయి ఉద్యోగులను బూతులు తిడుతూ వేధిస్తున్నారని ఏఎన్ఎంలు డిఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డిఎంహెచ్‌ఓ మా పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గుండుమల పిహెచ్‌సి వైద్యాధికారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అంతకుమునుపు సిఐటియు అనుబంధంగా కమిటీని ఎన్నుకున్నారు.

ప్రజల వద్దకే పాలన : ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ప్రజాశక్తి-తనకల్లు

'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి మండల పరిధిలోని కురుమోలపల్లి, మార్పురివాండ్లపల్లి, రాగినేపల్లి, నల్లమోలపల్లి, సింగిరాలపల్లి, గందోడువారిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చిన వెంటనే తూచ తప్పక అమలు చేస్తున్నారన్నారు. సచివాలయం, వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి అర్హులందరికీ సంక్షేమ ఫలాలను వారి ఇంటి వద్దకే చేరుస్తున్నారన్నారు. వివక్షకు తావు లేకుండా అర్హత ప్రామాణికంగా జగన్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అర్హులైన రైతులకు పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే ఆయా గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించారు. పరిష్కారం కాని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు కొక్కంటి శ్రీనివాసులు నాయుడు, దొరస్వామి, హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచులు, వివిధ శాఖల ఛైర్మన్లు, డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

విద్యార్థులను విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించి వారి బంగారు భవిష్యత్తుకు బాట వేయడమే విజయలక్ష్మి ఫౌండేషన్ ధ్యేయమని టిడిపి నాయకులు బంగారు కృష్ణమూర్తి పేర్కొన్నారు. టిడిపి వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పెట్టిన భిక్షతోనే ప్రస్తుతం ఈ స్థాయిలో ఉన్నానని తెలిపారు. ఉన్నత చదువులు చదివి నిరుద్యోగులుగా ఉన్న యువకులు నిరుత్సాహపడకుండా క్రీడల్లో రాణించి ప్రయివేటు కంపెనీ ల్లో ఉన్నత స్థాయి జీవన ఉపాధి పొందేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పర్వీన్‌బాను, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా రెన్యువల్‌ను వేగవంతం చేయాలి

అమరాపురం : వైఎస్ఆర్ బీమా రెన్యువల్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని లేనిచో చర్యలు తప్పవని ఎంపిడిఒ మునిస్వామి హెచ్చరించారు. మండల పరిధిలోని హేమావతి గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ వైఎస్ఆర్ బీమా రెన్యువల్‌ను రెండు రోజుల్లో 90% పూర్తి చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా నిద్రగట్టలో 21%, కేశవరంలో 22%, వి.అగ్రహారంలో 40%, హేమావతిలో 54%, మదనకుంటలో 55%, బసవన్నపల్లిలో 57%, అమరాపురం-2లో 63%, ఆలదపల్లిలో 63%, తమ్ముడేపల్లిలో 66%, హలకూరులో 66%, అమరాపురం-1లో 67% పూర్తయిందని తెలిపారు. అనంతరం హేమావతి పంచాయతీ పరిధిలోని కెంకెర గ్రామంలో పూర్తి చేసిన సీసీ రోడ్డును ఆయన పరిశీలించారు.

సోమఘట్టలో పోలీసుల గ్రామసభ

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

చిలమత్తూరు: మండల పరిధిలోని సోమఘట్ట పంచాయతీ కేంద్రంలో గురువారం రాత్రి ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం అక్రమ అమ్మకాలు చేపడితే కఠినమైన చర్యలు ఉంటాయని, గ్రామంలో యువకులు మద్యం, మత్తు పదార్థాలకు బానిసకావద్దని సూచించారు. గ్రామాల్లో శాంతి భద్రతల దృష్ట్యా ఎవరూ గొడవల జోలికి వెళ్లవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

వెండి కిరీటం వితరణ

వెండి కిరీటం అందజేస్తున్న దాత యుగంధర్

లేపాక్షి : లేపాక్షిలో వెలసిన వీరభద్రస్వామి ఆలయానికి గురువారం అనంతపురం జిల్లాలోని గోనుగుంట్ల రామానాయుడు కుమారుడు గోనుగుంట్ల యుగంధర్ కుటుంబ సభ్యులు స్వామి వారికి వెండి కిరీటం అందజేశారు. తొలుత వారికి ఆలయ కార్యనిర్వాహణ అధికారి నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించి తీర్థం ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పంటమార్పిడితో అధిక దిగుబడులు

బుక్కపట్నం : పంట మార్పిడి వల్ల రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డిడిఎ విద్యావతి తెలిపారు. మండల పరిధిలోని కొత్తకోట, గూనిపల్లి రైతు భరోసా కేంద్రాల్లో గురువారం ఈ అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిడిఎ మాట్లాడుతూ పంట మార్పిడిలో భాగంగా ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రాగి పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తుందన్నారు. అలాగే రాగి పంటను మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు రాగి పంట సాగు ద్వారా అధిక దిగుబడులు, లాభాలు పొందవచ్చని వివరించారు. కార్యక్రమం లో ఎడిఎ సనావుల్లా, వ్యవసాయ శాఖ అధికారు లు సతీష్‌బాబు, అబ్దుల్ అలీ, వ్యవసాయ శాఖ సిబ్బంది సురేంద్ర, సూర్యనారాయణ, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ యేసురత్నంను కలిసిన డాక్టర్ 'బత్తల'

కదిరి టౌన్ : వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్, సీనియర్ నాయకులు డాక్టర్ వెంకటరమణ గురువారం ఎమ్మెల్సీ ఏసురత్నంని గుంటూరులోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకుముందు ఎమ్మెల్సీ కుమారుడు ధీరజ్ ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. అనంతరం వారు ఎమ్మెల్సీని దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. వారితో పాటు జాకీర్, హరి కిషన్, రంజిత్, బాబ్‌జాన్, ముబారక్, కిరణ్, తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు మృతి

మృతిచెందిన వెంకటశివారెడ్డి

మృతిచెందిన జయమ్మ

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని గౌనివారిపల్లి సమీపంలో ఐచర్ వాహనం ఢీకొని వృద్ధ దంపతులు మృతిచెందారు. మండల పరిధిలోని మల్లసంద్రం గ్రామానికి చెందిన ఎస్.వెంకటశివారెడ్డి(65), ఆయన భార్య ఎస్.జయమ్మ(55) గురువారం ద్విచక్ర వాహనంపై గోరంట్లకు వెళ్తుండగా గోరంట్ల నుంచి కదిరికి పెళ్లి వారిని తరలిస్తున్న ఐచర్ వాహనం బలంగా ఢీ కొంది. దీంతో వారికి తీవ్ర గాయాలు కావడంతో పాటు తీవ్ర రక్తస్రావమై అక్కడి కక్కడే మృతి చెందారు. వెంటనే గ్రామస్తులు, ప్రయాణికులు అక్కడికి చేరుకొని సమాచారం ఇవ్వడంతో మల సముద్రంలోని వారి బంధువులు వచ్చి మతదేహాల వద్ద కన్నీరు మున్నీరుగా విలపించారు. విషయం తెలిసిన వెంటనే సిఐ సుబ్బారాయుడు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే మృతదేహాలను పోస్టుమార్టం కోసం పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఐచర్ వాహనం డ్రైవర్ పరారయ్యాడు.

మరో ప్రమాదంలో వివాహిత మృతి

రొద్దం : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన గురువారం మండల పరిధిలోని రొద్దం-గౌరాజుపల్లి మధ్యలో కోళ్ల ఫారం వద్ద చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని ఎం.కొత్తపల్లి గ్రామానికి చెందిన వెంకటేశులు భార్య ఈశ్వరమ్మ కు అనారోగ్యం బారిన పడడంతో వారు ద్విచక్ర వాహంపై రొద్దం ఆసుపత్రికి బయల్దేరారు. అయితే మార్గమధ్యలో కోళ్ల ఫారం వద్ద పాము అడ్డంగా రావడంతో వెనుక కూర్చున్న ఈశ్వర మ్మ కేకలు వేస్తూ కిందికి దూకేసింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకోగా స్థానికులు, భర్త కలిసి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం పెనుకొండ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే బికె అల్లుడు శశిభూషణ్ అక్కడికి చేరుకొని మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన తో పాటు ఎం.కొత్తపల్లి సర్పంచి నాగరాజు, పెనుకొండ పట్టణ కన్వీనర్ రవిశంకర్, తదితరులు ఉన్నారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం..

మడకశిర రూరల్ : మండలంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద గురువారం కొబ్బరికాయల లోడుతో వెళ్తున్న ఓ లారీ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. ఎలాంటి ప్రాణనష్టం చోటు చేసుకోకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆ లారీ కొబ్బరికాయల లోడుతో మహారాష్ట్రకు వెళ్తుండగా ప్రమాదానికి గురైందని పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

రొద్దం: మండల పరిధిలోని సానిపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం సెబ్, రొద్దం పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే వారి నుంచి రూ. 16,700, రెండు బైకులు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్ అందజేస్తున్న సిపిఐ నాయకులు

క్రీడాసామగ్రి వితరణ

కదిరి అర్బన్ : క్రికెట్ క్రీడాకారులకు గురువారం నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి కదిరప్ప, పట్టణ కార్యదర్శి లియాఖత్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు, రూ. 10,000 విలువ చేసే బ్యాట్లు, తదిత సామగ్రిని అందజేశారు. దీంతో సిపిఐ నాయకులకు క్రీడాకారులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గాలివీడు ఉపేంద్ర, గాండ్లపెంట మండల కన్వీనర్ శ్రీరాములునాయుడు, మండల నాయకులు తలుపుల ఈశ్వరయ్య, తనకల్లు రెడ్డప్ప, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా నటరాజు

బాధ్యతలు స్వీకరిస్తున్న నటరాజు

కదిరి అర్బన్ : కదిరి తహశీల్దార్‌గా గురువారం నటరాజు బాధ్యతలు చేపట్టారు. బుక్కపట్నం మండల తహశీల్దార్‌గా పని చేస్తూ కదిరి మండల ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్న నటరాజును రెగ్యులర్ తహశీల్దార్‌గా బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి కార్యాలయ సిబ్బంది సహకారంతో రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానని తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోండి

హిందూపురం : అంగన్వాడీ కేంద్రాల్లో లభించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ కోరారు. గురువారం 2వ వార్డు చౌడేశ్వరి కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శాంతి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, సిడిపిఒ రెడ్డి రమణమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అంగన్వాడీ కేంద్రంలో నర్సరితో పాటు ఎల్‌కెజి, యుకెజి విద్యను అందించడంతో పాటు విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించడం జరుగుతోందన్నారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో పాటు గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన ఎస్టీ సెల్ అధ్యక్షులు

పుట్టపర్తి రూరల్ : వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి అధ్యక్షతన తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో రాష్ట్రంలోని పార్టీ ఎస్‌టి సెల్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సంఘాల ప్రతినిధులతో గురువారంసమావేశం నిర్వహించారు. అందులో శ్రీసత్యసాయి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు తిరుపాల్‌నాయక్‌తో పాటు ఎస్టీ సెల్ అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయసాయి రెడ్డి వారికి పలు సూచనలు చేసినట్లు ఆయన తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండాలని, తమ తమ నియోజకవర్గాల్లో జగనన్న అమలు చేస్తున్న పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెవెళ్లాలని సూచించినట్లు తెలిపారు. రాయలసీమ వ్యాప్తంగా ఉన్న గిరిజనులతో పుట్టపర్తి కేంద్రంగా సమావేశం నిర్వహించాలని తిరుపాల్‌నాయక్‌కు సూచించారు. పార్టీ నిర్మాణంపై గిరిజన సంఘాల నాయకులు ఏవిధంగా ముందుకు వెళ్లాలో దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. అనంతరం తిరుపాల్ నాయక్ విజయసాయి రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తిరుపాల్‌నాయక్